## క్లుప్తంగా

### ప్రధాన న్యాయమూర్తికి శుభాకాంక్షలు



వరంగల్ లీగల్: హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జస్టిస్ పట్టాభి రామారావును అడ్వకేట్స్ క్లర్క్ అసోసియేషన్ బాధ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సందర్భంగా రామారావుకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనూప్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.పవన్‌కుమార్, మామునూరి రాజు, ఉపాధ్యక్షుడు రవి, కోశాధికారి నరేష్, సహాయ కార్యదర్శి మాణిక్యం, కమిటీ సభ్యులు శ్రీనివాస్, సుమన్, హరీష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### నగర మేయర్‌కు ఆహ్వానం

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో నిర్వహించనున్న భద్రకాళి భద్రేశ్వరస్వామి వార్ల కల్యాణ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నగర మేయర్ గుండు సుధారాణి, ప్రభాకర్ దంపతులను ఆహ్వానించారు. ఈ మేరకు వరంగల్ రామన్నపేటలోని స్వగృహంలో మేయర్ దంపతులను భద్రకాళి దేవాలయం ఈఓ శేషభారతి, అర్చకులు భద్రకాళి శేషు శనివారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

### ప్రపంచ తెలుగు సాహితీ సంబురాలకు ఆహ్వానం

విద్యారణ్యపురి: ఏపీలోని ఏలూరు పట్టణంలో మే 10, 11వ తేదీల్లో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ సాహితీ సంబురాల్లో పాల్గొనేందుకు వరంగల్ జిల్లాలోని కొంకపాక ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (తెలుగు) అడ్లూరి వెంకటేశ్వర్లుకు ఆహ్వానం అందింది. ఈమేరకు నిర్వాహకులు చైర్మన్ డాక్టర్ పత్తికొండ ప్రతాప్, కన్వీనర్ రమాపతి ఆహ్వాన పత్రాన్ని పంపించారని వెంకటేశ్వర్లు తెలిపారు.

### మెడికల్ సూపర్ స్పెషాలిటీ పరీక్షలో సాయిస్ఫూర్తి ప్రతిభ



హన్మకొండ: మెడికల్ సూపర్ స్పెషాలిటీ ప్రవేశ పరీక్షలో హనుమకొండ టీచర్స్‌కాలనీ -2కు చెందిన డాక్టర్ వంటేరు సాయిస్ఫూర్తి.. జాతీయ స్థాయి 58వ ర్యాంకు సాధించారు. ఆమె ప్రస్తుతం హైదరాబాద్ నిమ్స్‌లో సీనియర్ రెసిడెన్సీ షిప్ జనరల్ మెడిసిన్‌గా పని చేస్తున్నారు. సాయిస్ఫూర్తి తండ్రి తిరుపతి రెడ్డి.. టీజీ ఎన్పీడీసీఎల్‌లో చీఫ్ జనరల్ మేనేజర్ (ఫైనాన్స్), ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

### మెట్టుగుట్టపై రుద్రాభిషేకం



మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి, సీతారామ చంద్ర స్వామి దేవస్థానం మెట్టుగుట్టపై మాస శివరాత్రి, శని త్రయోదశి సందర్భంగా శనివారం రుద్రాభిషేకం, రుద్ర, నవగ్రహ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట ఈఓ శేషభారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

### రంగనాయక స్వామి కల్యాణం



హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని రాగన్న దర్వాజ పెద్దకోవెలలో హన్మద్గిరి రంగనాథస్వామి దేవాలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆలయ అర్చకులు హోమం, బలిహరణ నిర్వహించారు. అనంతరం రంగనాయక స్వామి కల్యాణం జరిపించారు.

### కేడీసీకి పాఠ్యపుస్తకాల అందజేత



విద్యారణ్యపురి: డిగ్రీ విద్యార్థుల కోసం సైన్స్ పాఠ్యాంశాలకు సంబంధించిన పది పాఠ్య పుస్తకాలను హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాటనీ అధ్యాపకుడు యుగేందర్ పంపిణీ చేశారు. ఈమేరకు కళాశాల లైబ్రరీకి ప్రిన్సిపాల్ రాజారెడ్డి చేతుల మీదుగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ భరత్, బాటనీ అధ్యాపకులు కోమల, శ్యామ్‌ప్రసాద్, గన్‌సింగ్, సమ్మయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దడ పుట్టిస్తున్న డివైడర్లు

- ప్రమాదాలకు కేంద్రంగా హంటర్‌రోడ్డు
- అసంపూర్తిగా డివైడర్ల నిర్మాణం
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

కాజీపేట అర్బన్: గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ హంటర్‌రోడ్డులోని డివైడర్లు ప్రయాణికులకు దడపుట్టిస్తున్నాయి. జూపార్క్ నుంచి కాకతీయ ప్రకృతి చికిత్సాలయం వరకు ఉన్న డివైడర్లు ప్రమాదకరంగా మారాయి. సరైన డివైడర్లు లేని కారణంగా వాహనదారులు ఎక్కడ పడితే అక్కడే యూటర్న్ తీసుకోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.



పూర్తికాని డివైడర్ నిర్మాణం

**అసంపూర్తిగా డివైడర్ల నిర్మాణం**

నిత్యం భారీ వాహనాలతో పాటు ద్విచక్ర, ఆటోలు, బస్సులు రాకపోకలు సాగించే హంటర్‌రోడ్డులో అసంపూర్తిగా డివైడర్లను నిర్మించి అర్ధంతరంగా అధికారులు వదిలేశారు. ఈ క్రమంలో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంటోందని పలువురు చెబుతున్నారు. హంటర్‌రోడ్డులో పూర్తిస్థాయిలో డివైడర్లను నిర్మించి ప్రమాదాల నుంచి కాపాడాలని నగర వాసులు, వాహనదారులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు.



ఇష్టానుసారంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

# బీసీల కోసం కేంద్రం చట్టం చేయాలి

న్యూశాయంపేట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో బత్తిని సదానందం అధ్యక్షతన హనుమకొండ బాలసముద్రంలో శనివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వెంకట్రాములు మాట్లాడారు. జనగణనలో కులగణన చేసి దాని ఆధారంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సూచించారు. సమావేశంలో ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శ్యామ్‌యాదవ్, భారత్ బచావ్ నాయకులు దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, సైంటిఫిక్ స్టడీ ఫెడరేషన్ చైర్మన్ చార్వాక, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

**బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి**

కేయూ క్యాంపస్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం డిమాండ్ చేసింది. ఈమేరకు కేయూ వద్ద పలువురు విద్యార్థులతో ఫోరం జిల్లా కోఆర్డినేటర్ మండల పరశురాములు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈబిల్లును ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన ప్రతీ నిరుపేద కుటుంబానికి అందించడమే లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ అధ్యక్షులతో ఇందిరమ్మ ఇళ్ల పథకంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, జక్కుల రవీందర్, విజయశ్రీ, మామిండ్ల రాజు, పోతుల శ్రీమన్నారాయణ, మానస, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్, మాధవిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

### పిల్లలకు ఆటపాటలతో విద్య



ఖిలా వరంగల్: అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని లక్ష్మీనగర్ సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. వరంగల్ విద్యానగర్ కాలనీలో టీచర్ శశికళ ఆధ్వర్యంలో ప్రీ స్కూల్ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పోషకాలను చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించాలని అన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో కూడిన చక్కటి విద్యను పిల్లలకు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్లు సంధ్య, జ్యోత్స్న, సుకన్య, సుభాషిణి, రాధ, ఆయాలు పుష్ప, సుక్రబీ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

# ఉచిత విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న పున్నమాచార్యులు

ఖిలా వరంగల్: వ్యవసాయ రంగానికే వెన్నెముకలైన కమ్మరి, వడ్రంగి వృత్తులతోపాటు విశ్వకర్మల చేపట్టే కుటీర పరిశ్రమలకు రైతులతో సమానంగా ఉచిత విద్యుత్‌ను అందించాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య రాజమల్లా పున్నమాచార్యులు కోరారు. ఈమేరకు వరంగల్ ఏకశిలనగర్‌లోని విశ్వకర్మ కమ్యూనిటీ హాల్‌లో సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండోజు వీరాచార్య ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని విశ్వకర్మల కుటీర పరిశ్రమలకు 50శాతం సబ్సిడీపై విద్యుత్‌ను అందించడం అభినందనీయమన్నారు. సమావేశంలో నామోజు జగన్నాథం, అబ్బోజు వీరాచారి, గన్నోజు మహేందర్, పానుగోటి జక్కన్న, వెంకటచారి, కృష్ణ, రామ్మూర్తి, జగదీశ్వర్, నరసింహ, పరమేశ్వర్, లింగం, సత్యనారాయణ, వీరాచారి, భిక్షపతి, వీరస్వామి, దేవేంద్రం, రాజ్‌కుమార్, విష్ణు, శ్రీనివాస్, సంతోష్‌చారి పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి



ఎండ్ల బండి తోలుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆటోవాలాలు ర్యాలీ తీశారు. ఈ ర్యాలీని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ జెండా ఊపి శనివారం ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎల్కతుర్తిలోని సభ ప్రాంగణం వరకు సాగింది.

**సభకు లక్షలాదిగా తరలివస్తున్నారు**

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలు లక్షలాదిగా తరలివస్తున్నారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సూర్యాపేట నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో రైతులు ఎండ్ల బండ్ల ద్వారా సభాస్థలికి రెండు రోజుల క్రితం బయలుదేరగా.. హనుమకొండకు శనివారం చేరుకున్నారు. వారికి హనుమకొండ హంటర్‌రోడ్డు సహకార నగర్ వద్ద వినయ్‌భాస్కర్, నాయకులు స్వాగతం పలికారు.

### ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం



మడికొండ: నిత్యం ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పని చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు. కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో పార్టీ మహాసభలను నాయకుడు మంద సుమన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేయగా భిక్షపతి మాట్లాడారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. గుడిసెవాసులకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, మాలోత్ శంకర్, ఐలయ్య, లక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయంపై ఫార్మసిస్టుల హర్షం

ఎంజీఎం: రాష్ట్రంలో ప్రభుత్వ ఫార్మసిస్ట్ గ్రేడ్ -2లను ఇక నుంచి ఫార్మసీ ఆఫీసర్స్, ఫార్మసిస్ట్ గ్రేడ్ -1లను సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్‌గా, ఫార్మసీ సూపర్‌వైజర్లను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్లుగా మార్పు చేస్తూ రాష్ట్ర హెల్త్, మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ జీఓ నంబర్ 71 ఉత్తర్వులను జారీ చేస్తూ తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, హెల్త్ సెక్రటరీ, హెల్త్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్, రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు ఉప్పు భాస్కర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శరత్‌బాబు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, కోశాధికారి జి.యాదయ్య, బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుదర్శన్ గౌడ్

# ముగిసిన హ్యాండ్‌బాల్ హంట్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న ప్రారంభమైన నాయిని విశాల్‌రెడ్డి స్మారక 7వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ హంట్ అండర్ -15 బాలబాలికల పోటీలు శనివారం ముగిశాయి. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని హ్యాండ్‌బాల్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించగా, శనివారం జరిగిన ముగింపు వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్లకు ట్రోఫీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకుడు, తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ మాట్లాడుతూ టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం కోశాధికారి తోట శ్యామ్, తదితరులు పాల్గొన్నారు. బాలికల విభాగంలో ఆసిఫాబాద్, బాలుర విభాగంలో కాటారం జట్లు విజేతగా నిలిచాయి.



ట్రోఫీ అందుకుంటున్న కాటారం బాలుర జట్టు

### నంబర్ ప్లేట్లు తప్పనిసరి

కాజీపేట: ప్రతీ ద్విచక్ర వాహనానికి ముందు, వెనుక నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ సీఐ నాగబాబు సూచించారు. సీపీ సన్‌ప్రీతి సింగ్ ఆదేశం మేరకు తనిఖీలు నిర్వహించి నంబర్ ప్లేట్లు లేని వాహన యజమానులపై కేసు నమోదు చేసి సదరు వాహనాలను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను కాజీపేట చౌరస్తాలో శనివారం స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించి, ఇ - చలాన్ ద్వారా జరిమానా విధించినట్లు వివరించారు.

# 'కాంట్రాక్టు ప్రొఫెసర్ల'ను క్రమబద్ధీకరించాలి



రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో శనివారం బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని రిజిస్ట్రార్ రామచంద్రం హామీ ఇవ్వడంతో యథావిధిగా కేయూ పరిపాలన భవనం ఎదుట వారు సమ్మెను కొనసాగించారు. సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి సందర్శించి మాట్లాడారు. గతంలో జూనియర్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్లు, డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసినట్లుగానే యూనివర్సిటీల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా క్రమబద్ధీకరించాలని సూచించారు. కేయూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ బాధ్యులు కరుణాకర్‌రావు, సాదు రాజేష్, శ్రీధర్‌కుమార్ లోథ్, సతీష్, భిక్షపతి, రవీందర్, సదాశివ్, జితేందర్, జూల సత్య, అరూరి సూర్యం, సూర్యనారాయణ, స్వామి, చంద్రశేఖర్, ఫిరోజ్, రఘువర్ధన్, మల్లేశ్, శ్రీదేవి, కవిత, సరిత, సుజాత, రాజేశ్వరి, రేఖ, ఫాతిమా, ప్రియాంక పాల్గొన్నారు.

# 30న 'భద్రకాళి'లో ముదిరాజ్‌ల సేవ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయంలో జరగనున్న భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 30న ముదిరాజ్ కులసంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి సేవ, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు భద్రకాళి దేవాలయం ఆవరణలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షుడు పల్లెబోయిన అశోక్‌కుమార్, వరంగల్ మహానగర అధ్యక్షుడు బయ్య స్వామి అధ్యక్షతన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ కుల రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అశోక్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

# నిర్వాహకులపై కేసు నమోదు

హసన్‌పర్తి: అనుమతి లేకుండా ఎలక్ట్రానిక్ కాంటా నిర్వహిస్తున్నందుకు ధాన్యం కొనుగోలు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తున్నట్లు తూనికలు కొలతల జిల్లా అధికారి శ్రీలత తెలిపారు. హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోల్‌మాల్ జరిగిన ఘటనపై శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా తూకం వేసిన ఎలక్ట్రానిక్ కాంటాను ఆమె పరిశీలించారు. ఎలక్ట్రానిక్ కాంటాలో సాంకేతిక సమస్య కారణంగా హెచ్చుతగ్గులు వస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఎలక్ట్రానిక్ కాంటా నిర్వహణకు సర్టిఫికెట్ అవసమన్నారు. 2024 - 2025వ సంవత్సరానికి కాంటా నిర్వహణకు సర్టిఫికెట్ పొందలేదని తెలిపారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా నిర్వాహకులు ఎలాంటి జాగ్రత్తలు పాటించలేదని చెప్పారు. ప్రస్తుతం కాంటా సక్రమంగా పనిచేయడం లేదని, దాంతో కాంటాను సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.



విచారణ చేస్తున్న అధికారులు

### తాళం వేసిన ఇంట్లో చోరీ

మడికొండ: కాజీపేట మండలం రాంపేట గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం రాంపేటకు చెందిన పుల్యాల భవాని - మహిపాల్‌రెడ్డి దంపతులు బొల్లికుంటలో వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే ఇంటికి తాళం వేసి శుక్రవారం కళాశాలకు వెళ్లి, కళాశాల ముగిసిన అనంతరం నర్సంపేట తిమ్మంపేటలోని తమ బంధువులను కలిసేందుకు వెళ్లారు. మరుసటి రోజు శనివారం రాంపేటలోని ఇంటికి వచ్చి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. 21 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు మడికొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

### రైలులో ప్రయాణికురాలి మృతి

ఖిలా వరంగల్: రైలులో ఓ ప్రయాణికురాలు అస్వస్థతకు గురై మృతి చెందినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబల్ సుదర్శన్ తెలిపారు. బీహార్ రాష్ట్రం సమస్తిపూర్‌కు చెందిన హలీమా ఖాతున్ (46).. తన భర్త ఇషారపుల్, మేనల్లుడు షబ్బీర్‌తో కలిసి రప్తి సాగర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో చైన్నై నుంచి బిహార్‌కు బయల్దేరారు. శనివారం ఉదయం సదరు మహిళ ఆకస్మాత్తుగా అస్వస్థతకు గురైనట్లు వరంగల్ రైల్వేస్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందగా, వరంగల్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం -2 వద్ద 108 అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచారు. రైలు స్టేషన్‌కు చేరుకోగానే ఆ మహిళను 108 సిబ్బంది పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతిరాలి భర్త ఇషారపుల్ ఫిర్యాదు మేరకు మృతదేహానికి శవ పరీక్షలు నిర్వహించి అప్పగించినట్లు సుదర్శన్ వివరించారు.

## క్లుప్తంగా

### తైక్వాండో క్రీడాకారుడికి సన్మానం



వరంగల్: ఇటీవల బెహ్రెయిన్ దేశంలో పారా తైక్వాండో ప్రపంచ చాంపియన్ టోర్నమెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించిన ఎల్లావుల గౌతమ్ యాదవ్‌ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కల్వకుంట్ల కవిత సన్మానించారు. హైదరాబాద్‌ బోడుప్పల్‌లోని గౌతమ్ ఇంటికి శనివారం రాత్రి వెళ్లి అభినందించారు. అంతకుముందు కవితను బీఆర్‌ఎస్ నాయకురాళ్లు డాక్టర్ హరిరమాదేవి, ముష్కె ప్రమీల కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, కుమార్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**కేయూలో వేసవి సెలవులు రద్దు చేయాలి**

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థులకు మే 1నుంచి ఇవ్వబోతున్న వేసవి సెలవులను రద్దు చేయాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రంను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెలవుల పేరుతో హాస్టళ్లు, మెస్‌లను మూసివేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న క్రమంలో వేసవి సెలవులు రద్దు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీఎస్‌ఎఫ్ నాయకులు మాతంగి వినయ్, మధు, మేకల పీటర్, భరత్, పోతరాజు ఉదయ్, రాజేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**సీతంపేటలో 'ఇళ్ల' లొల్లి**

హసన్‌పర్తి: తనకు తెలియకుండానే తన సంతకాన్ని ఫోర్జరీ చేసి జాబితాను అధికారులకు అందించారని సీతంపేటకు చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గుంపుల రణధీర్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. సీతంపేట గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద 20 ఇళ్లు మంజూరయ్యాయి. 20మంది పేర్లతో కూడిన జాబితాను ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిద్ధం చేసి అధికారులకు అందించారు. ఇటీవల అదనంగా మరో నాలుగు ఇళ్లు మంజూరయ్యాయని రణధీర్ తెలిపారు. లబ్ధిదారుల పేర్లను ఎంపిక చేయాల్సి ఉండగా, ఇందిరమ్మ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న తనకు తెలియకుండానే తన సంతకాన్ని ఫోర్జరీ చేసి జాబితాను అధికారులకు అందించారని పేర్కొన్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను రణధీర్ కోరారు.

**బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత**



మామునూరు: వరంగల్ తిమ్మాపురంలో శ్రీజన చైతన్య పురుషుల పొదుపు సంఘం సభ్యుడు రాయి వెంకటరమణ ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబానికి రూ.80వేల బీమా చెక్కును సంఘ అధ్యక్షుడు మాచర్ల రంజిత్‌కుమార్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బండి శ్యామ్, బోగవల్లి మధుకర్‌రావు, మేకల సూరయ్య, ములకలపల్లి విజేందర్, మాచర్ల శ్రీనివాస్, ఇల్లందల వెంకటస్వామి, లక్క రమేష్, కాయిత వెంకటేశ్వర్లు, ఇల్లందుల దేవేందర్, సట్ల భిక్షపతి, చెక్క సుమన్, కల్లెపు రాము పాల్గొన్నారు.

**నేడు హౌసింగ్ బోర్డు కాలనీ కమిటీ ఎన్నిక**

హన్మకొండ: 51వ డివిజన్ పరిధి హనుమకొండ హౌసింగ్ బోర్డు కాలనీ కమిటీ ఎన్నిక రసవత్తరంగా సాగుతోంది. ఈ కాలనీలో 750 మంది ఓటర్లు ఉండగా, ఏకగ్రీవంగా ఎన్నిక జరిపేందుకు కాలనీ పెద్దలు ప్రయత్నించినా సమన్వయం కుదరకపోవడంతో ఎన్నికలు నిర్వహణ తప్పనిసరైంది. దీంతో నామినేషన్లు స్వీకరించి ఎన్నికలు వెళ్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు గతవారం రోజులుగా కాలనీలో ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించారు. కొండ నాగరాజు, కోల సమ్మయ్య పోటీలో ఉన్నారు. ఈనెల 27న గఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించనున్నారు.

**అవని కళాశాలను సీజ్ చేయాలి**

హన్మకొండ: ప్రభుత్వ అనుమతులు లేని అవని జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్‌డీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. హనుమకొండ భీమారంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు ప్రాంతాల్లో కళాశాలలను ఏర్పాటు చేసి అడ్మిషన్లు స్వీకరిస్తున్నారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా మోసం చేస్తున్న కళాశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని కోరారు.

**పారిశుద్ధ్య కార్మికులకు టోపీల పంపిణీ**

హన్మకొండ: హనుమకొండ భవానీనగర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండుటెండలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎండ నుంచి ఉపశమనం కోసం టోపీలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డి, జవాన్లు సతీష్, కుమార్, భిక్షపతి పాల్గొన్నారు.

**విశ్వ ఆయుర్వేద పరిషత్ ఫౌండేషన్ వేడుకలు**



కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో విశ్వ ఆయుర్వేద పరిషత్ ఫౌండేషన్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈమేరకు ఆయుర్వేద వైద్యులకు బేసిక్ లైఫ్ సపోర్ట్ అనే థీంపై ఆస్పత్రి వైద్యులు దినేష్‌రెడ్డి, లక్ష్మీదీపక్ నాగుల్, శ్రవణ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి మార్కెటింగ్ హెడ్ హరినాథ్, ప్రవీణ్, రాము, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

**చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి**

ఖిలా వరంగల్: తీవ్ర గాలిన గాయాలతో ఓ వ్యక్తి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ లెనిన్‌నగర్‌కు చెందిన ఎండీ.అబ్బాస్ (23), కాశికుంట చెందిన రిజ్వాన దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో రెండు నెలల క్రితం అబ్బాస్‌తో గొడవ పెట్టుకొని అజ్మీరా పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం రాత్రి అజ్మీరా వద్దకు అబ్బాస్ వెళ్లాడు. అనంతరం అక్కడ ఏం జరిగిందో తెలియలేదు. అబ్బాస్ తీవ్రంగా కాలిన గాయాలతో పడిఉండగా కుటుంబీకులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాలిన గాయాలతో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి యాకూబ్ ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.